క్లుప్తంగా

నేడు శివరాయునిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

మర్రిపూడి: మండలంలోని కాకర్ల సచివాలయం పరిధిలోని శివరాయునిపేట గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్‌కే ఖాశింపీరా శనివారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరవుతారని తెలిపారు. మండల అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ప్రపంచ పశువైద్య దినోత్సవం

సీఎస్‌పురం (పీసీపల్లి): పశువైద్య సిబ్బంది పశుపోషకులకు అందుబాటులో ఉంటూ పశువైద్య స్ఫూర్తిని కాపాడాలని పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశం హాలులో శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవం నిర్వహించారు. పశువులకు మెరుగైన వైద్యం అందిస్తూ పశుపోషకుల జీవనాధారం మెరుగు పరిచేందుకు కృషి చేయాలన్నారు. నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. మొబైల్ పశువైద్యశాల వైద్యులు పురంధరేశ్వరి, సీఎస్‌పురం, పామూరు మండలాల రైతు భరోసాకేంద్రాల పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

నేడు శానంపూడిలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి గ్రామంలో ఈ నెల 30వ తేదీ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు చిలకపాటి సుధాకరరావు తెలిపారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: మద్యం బెల్టు షాపుపై దాడి చేసి 10 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన స్థానిక సోమరాజుపల్లి రైల్వే గేటు సమీపంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సోమరాజుపల్లి రోడ్డులో కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తున్న వి.వెంకటేశ్వర్లు అదే షాపులో మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు.

ప్రమాదాలకు దూరంగా ఉండండి

సింగరాయకొండ: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా చర్యలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమా సూచించారు. స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రాణాపాయం కలగదన్నారు. మనం చేసే చిన్న పొరపాటు వలన మన కుటుంబం మొత్తం బాధపడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

పొగాకు కనిష్ట ధర రూ.175

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో కేజీ కనిష్ట ధర రూ.175 పలికింది. దావగూడూరు, చింతలపాలెం గ్రామాలకు చెందిన రైతులు 887 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 837 బేళ్లను కొనుగోలు చేశారు. 40 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.200 పలకగా, సరాసరి రూ.196.13 పలికింది. వేలంలో మొత్తం 19 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

టంగుటూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా రత్నజ్యోతి

టంగుటూరు: టంగుటూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా రత్నజ్యోతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. టంగుటూరు ఎంపీడీవో అజిత సెలవుపై వెళ్లడంతో పొన్నలూరు ఎంపీడీవో రత్నజ్యోతిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

జరుగుమల్లి మండల అభివృద్ధికి కృషి

జరుగుమల్లి (సింగరాయకొండ): మండల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీపీ బెల్లం నిర్మల అన్నారు. జరుగుమల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారుల సహకారం బాగుందని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ మాతంగి చంద్రలీల, వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, ఎంపీడీవో రామకృష్ణ, పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్, విద్యుత్ శాఖ ఏఈ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులు

- వెలిగండ్లలో జెడ్పీటీసీ క్యాంపు కార్యాలయం ప్రారంభం



వెలిగండ్ల హైస్కూల్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



వెలిగండ్లలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్‌పాలనలో సంక్షేమం, అభివృద్ధి అంటే అందరికీ తెలిసినట్టైందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. వెలిగండ్లలో జెడ్పీటీసీ క్యాంపు కార్యాలయాన్ని జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం కార్యాలయాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో 55 మండలాల్లో జెడ్పీటీసీ క్యాంపు కార్యాలయాలను మంజూరు చేశామన్నారు. వెలిగండ్ల మండలంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో కనిగిరి నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి చేశానన్నారు. జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు, ఎంపీడీఓ టి. సుకుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బుర్రా, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మెన్ చింతలచెర్వు సత్యనారాయణరెడ్డిని సన్మానించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, ఆరెకటిక రాష్ట్ర చైర్మన్ దాదా లక్ష్మీకుమారి, ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి కుప్పనబోయిన పద్మావతి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, వెలిగండ్ల సర్పంచ్, ఎంపీటీసీలు టి. సురేష్‌బాబు, చిలకల వెంకటేశ్వరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వై. నాగూర్‌యాదవ్, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, కనిగిరి ఏఎంసీ చైర్మెన్ సరితారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు వైఎం ప్రసాద్ రెడ్డి, హనుమంతునిపాడు జెడ్పీటీసీ సభ్యులు దద్దాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో విద్యకు పెద్దపీట

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు పెద్దపీట వేశారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం రాత్రి జరిగిన వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ పి. చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణరెడ్డిలతో కలిసి మాట్లాడారు. నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా మార్చడమే కాకుండా సకల సౌకర్యాలు కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి భవిష్యత్ పొందాలన్నారు. ఎంపీడీఓ టి. సుకుమార్, జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, డాక్టర్ ఉరళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వై. నాగూర్ యాదవ్, సింగిల్‌విండో చైర్మెన్ కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ టి. సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు చిలకల వెంకటేశ్వరరెడ్డి, ఆరెకటికె రాష్ట్ర చైర్మన్ దాదా లక్ష్మీకుమారి, ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి కుప్పనబోయిన పద్మావతి, పొల్లా సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు సి. విజయభాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.



పకీరుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వరికూటి అశోక్‌బాబు

ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలెంలో శనివారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వరికూటి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో 79 వేల కుపైగా గృహాలను సందర్శించినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వలన చాలా తక్కువ మంది మాత్రమే అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు పొందలేకపోయారని తెలిపారు. వారందరికీ కూడా పథకాలు అందించి లబ్ధి చేకూర్చడమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నియమించిన జన్మభూమి కమిటీల వలన అర్హత ఉన్నా, లేకపోయినా ఆ పార్టీ మద్దతుదారులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించారని గుర్తుచేశారు. ఇతర పార్టీల వారికి అర్హత ఉన్నా పథకాలు ఇవ్వలేదని విమర్శించారు. కానీ, ఇప్పుడు మాత్రం తాను అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడిని కోటీశ్వరుడిని చేస్తానంటూ చంద్రబాబు మోసపూరిత మాటలు చెబుతున్నాడని, ప్రజలెవరూ పట్టించుకోవద్దని కోరారు. ప్రజల సమస్యలతో పాటు ఆ ప్రాంతంలోని ఇబ్బందులు కూడా తెలుసుకుని తాము పరిష్కరిస్తున్నానని, ప్రతి పేదవాడు సుఖంగా ఉండటమే జగనన్న లక్ష్యమని వరికూటి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, యన్నాబత్తిన కార్తీక్, షేక్ సుల్తాన్, దాదా సాహెబ్, షేక్ సలీం, షేక్ పటేల్, పిట్టా బ్రహ్మయ్య, గాలి బాలాజీ, షేక్ మహబూబ్ బాషా, షేక్ సుబాహాని, మాబూ మేస్త్రి, శీలం రమణయ్య పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో భరోసా



పామూరు: మానమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్‌లు అందజేస్తున్న కొండబాబు, నాయకులు



ఇంటికి జగనన్న స్టిక్కర్‌ను అంటిస్తున్న నాయకులు

సీఎస్‌పురం (పీసీపల్లి): సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమకు భరోసాగా ఉన్నారని ప్రజలంటున్నారంటూ మండల పార్టీ అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సచివాలయ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలను ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. సచివాలయం కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, యూత్ అధ్యక్షులు అటిలయ్య, సింగిల్ విండో అధ్యక్షులు పి. సుబ్బరామయ్య, హ్యూమన్ రైట్స్ గౌస్, వాసు, ఖాజా, నాయకులు మధు, రమేష్, బోయన లక్ష్మయ్య ఉన్నారు.

గడప గడపకూ సంక్షేమం

పామూరు: అర్హతే ప్రామాణికంగా కులం, మతం, పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలలో గడప గడపకూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయని మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు అన్నారు. మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆఖరిరోజు శనివారం నిర్వహించారు. సర్పంచ్ కొండబాబు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలను వారికి వివరించారు.

నేడు ఐసీడీఎస్ నూతన కార్యాలయం ప్రారంభం



నూతన ఐసీడీఎస్ కార్యాలయం

టంగుటూరు: టంగుటూరులోని కొండపి రోడ్డులో ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కార్యాలయాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు సీడీపీవో మల్లీశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లోని 215 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వారందరికీ చేరువుగా టంగుటూరు కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ గఫార్
- రూ 1.60 కోట్లతో అభివృద్ధి పనుల ప్రణాళిక

కనిగిరి రూరల్: పట్టణాభివృద్ధిలో అందరి సహకారంతో ముందడుగు వేద్దామని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం మున్సిపల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో దశలవారిగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రూ. 1 కోటి 60 లక్షలు 15వ ఆర్థిక సంఘ నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, సీసీ డ్రైన్లు తక్షణ చర్యలు చేపడతామన్నారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ సచివాలయ శానటరీ సెక్రటరీల పనితీరుపై కౌన్సిల్ సభ్యుల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు చేపట్టే శానిటేషన్ పై నివేదికలు తెప్పించుకుని ప్రణాళికా బద్ధంగా పనిచేయించుకోవాలని కోరారు. రాబోయే నీటి ఎద్దడి నివారణ చర్యలో భాగంగా ప్రతి వార్డులో ఒక బోర్‌వెల్ ఏర్పాటు, ఉన్న బోర్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు.

సమస్యల విన్నపాలు

6వ వార్డుడు సభ్యుడు పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వార్డులో నీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని, తన వార్డుకు శాంక్షన్ చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టర్, ఏఈల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 13వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో పీతుల దొరువు, కొండ కింద క్వారీ వద్ద, పెద దొరువు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉన్నాయని, వేసవి సెలవులు రావడంతో చిన్నారులు, విద్యార్థులు ఈత సరదాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకునే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని వివరించారు. తక్షణం ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ ఆఫీసు నుంచి వేసవి సెలవలు ముగిసేంత వరకు భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలని, లేదా క్వారీ యజమానులతో మాట్లాడి నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో శనివారం చిన్నారి మృతి జరిగిన ఘటనను ఉదాహరణగా వివరించారు. కౌన్సిలర్ దేవరాజ్ మాట్లాడుతూ వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పులిశాంతి గోవర్దన్, మాణిక్యరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చింతలచెరువు సత్యనారాయణరెడ్డి

పామూరు: తాగునీటి చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కందుకూరు రోడ్డులో చింతలచెరువు తన సొంతనిధులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలసి ప్రారంభించారు. వేసవిలో పాదచారులు, వాహనదారులు, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేవారికి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం పామూరులో అంకాళమ్మ వీధిలో ఇరువురు వికలాంగ పిల్లలతో బాధపడుతున్న పశుపులేటి విజయ కుటుంబానికి సాయంగా రు.20 వేలు ఆర్థికసాయం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ గుంటుమడుగు వెంకటేశ్వర్లుకు రు.20 వేల ఆర్థికసాయం చేసి, ముఖ్యమంత్రి ఆర్థికసాయం వచ్చేలా చూస్తానన్నారు. మోహన్‌రెడ్డిని పరామర్శించారు. అంబటి కొండారెడ్డి, కేతు రమేష్‌రెడ్డి, ముడియాల అనంత రెడ్డి, సత్యంరెడ్డి, అంబవరపు లక్ష్మీనారాయణరెడ్డి, అంచూరి సత్యంరెడ్డి, శంకర్, వెంకట్‌రెడ్డి, కందులశ్రీను, కేతు బ్రహ్మానందరెడ్డి, విష్ణు, కోటపాటి రమణారెడ్డి, జనార్దన్, రవీంద్రారెడ్డి, ఫణీంద్రారెడ్డి, శ్రీకాంత్, చైతన్య, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలె గోపాల్‌రెడ్డి, పలవురు పాల్గొన్నారు.

వేలంలో రూ. 22.68 లక్షల ఆదాయం

సీఎస్‌పురం (పీసీపల్లి): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్ర మైన భైరవకోనకు షాపుల లీజు ద్వారా రూ. 22.68 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ నర్రా నారాయణరెడ్డి , చైర్మన్ సిద్దు రమణారెడ్డి తెలిపారు. ఎండోమెంట్ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో 11 ఐటమ్స్‌గాను 7 ఐటమ్స్‌కు వేలం పాట జరిగాయి. మిగతా వాటికి మరోసా వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వాహన పార్కింగ్ రుసుము వసూలు చేసుకునే హక్కు కోసం రూ. 7.25 లక్షలు, కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయాల కోసం రూ. 9.05 లక్షలు, మిఠాయిలు అమ్ముకునేందుకు రూ. 2.04 లక్షలు, ఫలహార శాల నడుపుకునేందుకు రూ. 2.57 లక్షలు, పూల విక్రయానికి రూ. 62 వేలు, అమ్మవారి భక్తులు సమర్పించు చీరలు, రవికలు, సేకరించేందుకు రూ. 52వేలు, తలనీలాలు పోగుచేసుకునేందకు రూ. 62వేలు వచ్చినట్లు తెలిపారు. సిద్దు వెంకటరెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యుడు గంధం వెంకటాద్రి, కొత్తపల్లి ఉప సర్పంచ్ ఇమామ్ సాహేబ్, బసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన బ్రహ్మంగారి నాటకం



బ్రహ్మంగారి నాటకంలోని ఓ సన్నివేశం

మర్రిపూడి: బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి ప్రదర్శించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి నాటకం ప్రేక్షకులను అలరించింది. ఆరాధన సందర్భంగా పూజారి ఈదుమూడి గోవిందయ్య, పాలగిరి వెంకటేశ్వరరెడ్డి స్వామివారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మంగారి నాటకంలో రెండో బ్రహ్మంగారిగా చినగంజాం వెంకటేశ్వరరెడ్డి, ఆదాంబి, ఈశ్వరమ్మలుగా రాఘవేంద్ర, సిద్దయ్య పాత్రను ఎం.వెంకటేశ్వర్లు పోషించారు. వీరి పద్యాలు, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

కార్మికులంతా ఐక్యం కావాలి

కనిగిరి రూరల్: మేడే స్ఫూర్తితో హక్కుల సాధనకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో శనివారం కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు, సామాజిక భద్రత కోసం కార్మికులంతా ఐక్యం కావాలన్నారు. జి. బాలిరెడ్డి, జీపీ రామారావు, కిరణ్, అశోక్, కోటయ్య, కృష్ణారెడ్డి, పవన్, సుబ్రహ్మణ్యం, కిషోర్ పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలన దిశగా జగనన్న పరిపాలన




సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

సింగరాయకొండ: పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండపి నియోజకవర్గంలో 1.08 లక్షల గృహాలు ఉండగా, 85 వేల గృహాలను తాము సందర్శించినట్లు తెలిపారు. 51 వేల గృహాలకు ప్రభుత్వ పథకాలను వివరించామని, 50 వేల మిస్డ్ కాల్స్ వచ్చాయని వివరించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చేసిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించగలిగామన్నారు. ఇది జగనన్న చేపట్టిన ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని కొనియాడారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నవరత్నాల పథకాలతో పాటు మరిన్ని పథకాల ద్వారా 2.50 లక్షల కోట్ల రూపాయలను పేదల బ్యాంకు ఖాతాలకు అవినీతి రహితంగా జగనన్న జమచేశారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో 600 హామీలిచ్చి కేవలం 60 హామీలే అరకొరగా నెరవేర్చారని విమర్శించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల ఆధిపత్య పాలన సాగిందని, అదే జగనన్న పాలనలో వలంటీర్, సచివాలయ వ్యవస్థలు తీసుకొచ్చి పేదవానికి స్వేచ్ఛ ఇచ్చిన గొప్ప సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కొండపి ఎమ్మెల్యే స్వామి టీడీపీ పాలనలో 15 వేల మరుగుదొడ్లు కట్టకుండా సుమారు 22 కోట్ల రూపాయలు స్వాహా చేశారని వరికూటి ఆరోపించారు. కట్టినట్లు రికార్డులు సృష్టించారన్నారు. మరుగుదొడ్ల స్కాంలో బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే సమస్య లేదని, అందరిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే స్వామి తాను చేసిన అవినీతిని ఒప్పుకుని పేదవాడిని క్షమాపణ అడగాలని, లేకపోతే పేదవాళ్లతో చెంబులతో అతని ఇంటివద్ద ధర్నా చేస్తానని హెచ్చరించారు. చంద్రబాబు ఫొటో ఉన్న ఇంటికి కూడా లక్షల రూపాయలు ప్రభుత్వ పథకాల ద్వారా జగనన్న ఇచ్చారని కొనియాడారు.

1000 బైకులతో భారీ ర్యాలీ...

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి వరికూటి వస్తున్న సందర్భంగా వెయ్యి మోటారు సైకిళ్లతో నియోజకవర్గస్థాయిలో భారీ ర్యాలీ నిర్వహించారు. టంగుటూరులోని పార్టీ కార్యాలయం నుంచి మొదలైన బైకు ర్యాలీ.. సింగరాయకొండలో కలికవాయ ఫ్లెటోవర్ వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి మండలంలోని మోటారుసైకిళ్లు కూడా కలవడంతో భారీ ర్యాలీగా మారింది. ర్యాలీలో వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు వరికూటి నివాళులర్పించారు. ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, సర్పంచ్ యన్నాబత్తిన సరోజ, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, టంగుటూరు జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, యన్నాబత్తిన కార్తీక్, షేక్ సుల్తాన్, దాదా, పిట్టా బ్రహ్మయ్య, పొన్నలూరు మండల అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఐదు మండలాల జేసీఎస్ అధ్యక్షుడు తన్నీరు సుబ్బారావు, రామచంద్రరావు, సంజీవరెడ్డి, గొట్టిపాటి మురళి, తిరుపతిరెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, కాళహస్తి వెంకారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఏఎల్ఎన్ఎం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

కనిగిరి రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ సెమిస్టర్ ఫలితాల్లో ఎఎల్ఎన్ఎం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బీఎస్సీ కంప్యూటర్‌లో నూనే రామ మేఘన 761/800 మార్కులతో టౌన్ ఫస్ట్, పగడాల శ్రావణి 760/800 మార్కులతో టౌన్ సెకండ్, ఎస్. కోటేశ్వరి బీకాం కంప్యూటర్స్‌లో 311/350 మార్కులతో టౌన్ ఫస్ట్, బీజెడ్‌సీలో వై. ధనలక్ష్మి 849/900 మార్కులతో టౌన్ ఫస్ట్, సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు ఆవుల లక్ష్మీ నారాయణమ్మ (ఎఎల్ఎన్ ఎం) కళాశాల కరస్పాండెంట్ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది విద్యార్థులను అభినందించి, స్వీట్లు తినిపించారు.

అగ్ని ప్రమాదంలో జామతోట దగ్ధం

సీఎస్‌పురం (పీసీపల్లి): అగ్ని ప్రమాదానికి జామతోట దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కనిగిరి రోడ్డులోని తిరుమల శెట్టి శ్రీరాములుకు చెందిన జామతోట ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ అయి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. వీటితో పాటు డ్రిప్ పరికరాలు, మోటార్ పైపులు కూడా కాలిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. వీఆర్ఓ శ్రీనివాసులు అగ్నిప్రమాదం జరిగిన జామతోటను పరిశీలించి బాధితుడి నుంచి వివరాలు సేకరించారు.